క్లుప్తంగా

పొదుపు ఎంతో అవసరం



విద్యార్థులకు ప్లేట్లు అందిస్తున్న ఆర్‌బీఐ ఎల్‌డీఓ నాగప్రవీణ్, తదితరులు

డెంకాడ: పొదుపు జీవితానికి ఎంతో అవసరమని.. దాన్ని చిన్నతనం నుంచే అలవాటు చేసుకోవాలని ఆర్‌బీఐ ఎల్‌డీఓ నాగప్రవీణ్ అన్నారు. మండలంలోని పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం స్టీల్‌ప్లేట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగప్రవీణ్ మాట్లాడుతూ, నేటి పొదుపు రేపటి మదుపని చెప్పారు. అలాగే అక్షరాస్యత ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఎల్‌డీఎం శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎస్.రవిశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జొన్నాడలో వైద్య పరీక్షలు



రోగుల నుంచి రక్తం శాంపుల్స్ సేకరిస్తున్న వైద్య సిబ్బంది

డెంకాడ: మండలంలోని జొన్నాడలో సుగర్ వ్యాధిగ్రస్తులకు హెచ్‌బీఏ1సీ పరీక్షలు బుధవారం నిర్వహించారు. ఏఎన్‌ఎం హెచ్. మహేశ్వరి రోగుల నుంచి శ్యాంపుల్స్ సేకరించి పరీక్షించారు. ఈ సందర్భంగా సుగర్ వాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ ఎస్.సూరిబాబు, పంచాయతీ కార్యదర్శి బంగారాజు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం



ప్రభుత్వ భూమిలో ఆక్రమణదారులు వేసిన పోల్స్‌ను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

భోగాపురం: మండలంలోని తోటపల్లి గ్రామం కొంగవానిపాలెం రెవెన్యూ పరిధి సీతమ్మ చెరువు సమీపంలో సర్వే నంబర్147లో సబ్ డివిజన్ 11 నుంచి 16 వరకు ఉన్న నంబర్లలో సుమారు ఎకరా 57 సెంట్ల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఆయా నంబర్లలో గల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఉపాధి వేతనదారులు, తదితరులు తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్‌ను మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే ఆయన రెవెన్యూ సిబ్బందితో కలిసి బుధవారం క్షేత్ర పరిశీలన చేపట్టి భూమిని స్వాధీనపరుచుకున్నారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

హుండీల ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి దేవస్థానం దత్తాలయమైన స్థానిక శివాలయం వీధిలో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం, వీరరాజేశ్వరస్వామి దేవస్థానం (మూడు కోవెళ్లు) హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. వేంకటేశ్వరస్వామి హుండీల నుంచి రూ. 5,68,266 నగదు, బంగారం 44 గ్రాముల 220 మిల్లీగ్రాములు, వెండి 1.650 గ్రాములు లభించింది. వీరరాజేశ్వరస్వామి దేవస్థానం హుండీల నుంచి 76, 394 రూపాయల లభించిందన్నారు.

తనిఖీలు



బెస్ట్ జూనియర్ కళాశాల వద్ద అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, తదితరులు

విజయనగరం క్రైమ్: జిల్లాలోని పలు ఇంటర్ పరీక్ష కేంద్రాలను అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ బుధవారం తనిఖీ చేశారు. పరీక్షల్లో ఎటువంటి అవకతవకలు, కాపీయింగ్ జరగకుండా తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. నెల్లిమర్ల, గుర్ల, చీపురుపల్లి, విజయనగరం పట్టణంలోని పలు కేంద్రాలను పరిశీలించారు. బందోబస్తు విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, అధికారులకు భద్రతాపరమైన సూచనలు చేశారు.

మొల్ల రచనలతో.. వాడుక భాషకు వన్నె

- ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి
- అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్



విజయనగరం క్రైమ్: మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్



విజయనగరం అర్బన్: మొల్ల చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి సందీప్, తదితరులు



డెంకాడ: కవయిత్రి మొల్ల చిత్రపటానికి పూలమాల వేస్తున్న అడిషినల్ కమాండెంట్ సీహెచ్ సామ్యుల్ జాన్

విజయనగరం క్రైమ్: తన రచనలతో వాడుక భాషకు వన్నె తెచ్చిన కవయిత్రి మొల్లమాంబ అని జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ అన్నారు. కవయిత్రి ఆత్మకూరి మొల్లమాంబ జయంతిని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్ల చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలుగు కవయిత్రిగా కీర్తి గడించిన మొల్ల.. సరళమైన వాడుక భాషలో సామాన్యులకు అర్థమయ్యే శైలిలో రచనలు చేశారన్నారు. సంస్కృత భాషలోని రామయణాన్ని ప్రప్రథమంగా తెలుగులోకి అనువదించిన మహిళగా ఘనత వహించారని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనివాసరావు, డీపీఓ పర్యవేక్షకులు ప్రభాకరరావు, డీసీఆర్‌బీ ఎస్సై గణేష్, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

సరళమైన రచనలు

డెంకాడ: ప్రముఖ కవయిత్రి మొల్ల రచనలు సరళమైనవని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ అడిషినల్ కమాండెంట్ సీహెచ్ సామ్యుల్ జాన్ అన్నారు. బెటాలియన్‌లోని ఫంక్షన్ హాల్‌లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామ్యుల్ జాన్ మాట్లాడుతూ.. 16వ శతాబ్దపు కవయిత్రి మొల్ల తెలుగులో రచించిన రామాయణం ప్రసిద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు జీవీ ప్రభాకరరావు, ఎం.లక్ష్మీనారాయణ, బెటాలియన్ అధికారులు, సిబ్బంది, మినిస్టీరియల్ స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జయంతి..

విజయనగరం అర్బన్: ప్రముఖ కవయిత్రి మొల్లమాంబ జయంతి స్థానిక కలెక్టరేట్‌లోని బీసీ వెల్ఫేర్ అధికారి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మొల్లమాంబ చిత్రపటానికి బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి కె.సందీప్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సంఘ జిల్లా అధ్యక్షుడు కోసూరి రమణ, ప్రధాన కార్యదర్శి కాకుళపు వెంకటమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉబ్బిలిశెట్టి అప్పలస్వామి, జోనల్ కమిటీ అధ్యక్షురాలు అంబటి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యోగులు రావి శ్రీనివాసరావు, పెంకి వెంకటరావు పాల్గొన్నారు.

పెద్ద చెరువును మరింత అభివృద్ధి చేస్తా..



వాకింగ్ ట్రాక్ ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- పెద్ద చెరువు గట్టుపై నిర్మించిన వాకింగ్ ట్రాక్ ప్రారంభం

విజయనగరం: రానున్న రోజుల్లో పెద్ద చెరువును మరింత అభివృద్ధి చేస్తానని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని వెంకటలక్ష్మి జంక్షన్ వద్ద చెరువుగట్టు ప్రాంతాన్ని అభివృద్ధి చేసి మహాత్మాగాంధబు వాకింగ్ ట్రాక్‌గా తీర్చిదిద్ది బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాక్ చుట్టుపక్కల మొక్కలు నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచించారు. రానున్న రోజుల్లో పెద్ద చెరువు గట్టు ప్రాంతమంతా ప్రజా వినియోగంలోకి తీసుకురానున్నట్లు చెప్పారు. నలువైపులా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆచంట గార్డెన్‌ను అందంగా తీర్చిదిద్దగలిగామన్నారు. దోమల మందిరం ప్రాంతాన్ని హెల్త్ ఎరీనాగా మార్చనున్నట్లు చెప్పారు. అక్కడ సైక్లింగ్ చేసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. నగరంలో ఇప్పటికే రహదారులు విస్తరించామని.. అంబటిసత్రం నుంచి కొత్తపేట వరకు రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజా సహకారం, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సూచనలతోనూ నగరాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేయర్ వి.విజయలక్ష్మి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ ఆదారి రుక్మిణి, వైఎస్సార్‌సీపీ నాయకులు యడ్ల రాజేష్, బలివాడి కాశీపతిరావు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

క్రాస్‌ప్రోగ్రాం వాహనం ప్రారంభం



క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి

భోగాపురం: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పాడైన బోరుబావులకు మరమ్మతులు చేపడుతున్నట్లు మండల పరిషత్ అధ్యక్షురాలు ఉప్పాడ అనూషారెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలోని వివిధ పంచాయతీల్లో ఉన్న 650 తాగునీటి బోర్లకు మరమ్మతులు చేపట్టేందుకు సుమారు రూ.5 లక్షల ఎంపీపీ నిధులతో మెటీరియల్ కొనుగోలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పడాల భానుప్రకాష్, ఎంపీడీఓ చంద్రకళ, ఏఓ దాసరి బంగారయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హేమంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లి జాతరకు సర్వం సిద్ధం



ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బంటుపల్లి వెంకటరావు, తదితరులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధి బంటుపల్లి వెంకటరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల వద్ద ఉన్న ఆలయం ఆవరణలో ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి 17 వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. 15న ప్రత్యేక పూజలతో జాతర ప్రారంభమవుతుందన్నారు. 16న తొలేళ్ల ఉత్సవం, 17న సిరిమానోత్సవం వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. భక్తులందరూ అమ్మవారి జాతర మహోత్సవాల్లో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వాలి, రామకోటి, పూజారి చందక అప్పారావు, అగ్రపు సన్యాసిరావు పాల్గొన్నారు.

ఘనంగా పూడమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



అన్న సమారాధనలో పాల్గొన్న బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు, పార్టీ నాయకులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని కొండపేటలో పూడమ్మతల్లి ఆలయ ఐదో వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమారుడు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు, నగర పంచాయతీ కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, పైల భారతి, మొయిద శ్రీనివాసరావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జానా ప్రసాద్, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా సతీష్, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అన్న సమారాధన చేపట్టారు. 16వ వార్డు కన్వీనర్ పొంద్రంకి సత్యనారాయణ, పైల మురళి, దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

శాప్ చైర్మన్ బైరెడ్డికి సత్కారం



శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని సత్కరించి, జ్ఞాపికను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ యువజన ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని బుధవారం స్థానిక జిల్లా పరిషత్ చైర్మన్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. విజయనగరం జిల్లాకు మొదటిసారిగా విచ్చేసిన బైరెడ్డిని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు దుస్సాలువాతో సత్కరించి బొబ్బిలి వీణను బహూకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం పార్లమెంట్ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

విజయనగరం క్రైమ్: మండలంలోని కోరుకొండపాలెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై విజయనగరం రూరల్ పోలీసులు బుధవారం దాడి చేపట్టారు. ఈ సందర్భంగా ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 13,320 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఆర్. వాసుదేవ్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అదుపులో పందాలరాయుళ్లు..

పూసపాటిరేగ : మండలంలోని వెల్దూరు సమీపంలో కోడిపందాలు ఆడుతున్న ఆరుగురుని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎ. సన్యాసినాయుడు తెలిపారు. వారి వద్ద నుంచి 710 రుపాయల నగదు, 5 కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

జనాభా లెక్కల ప్రకారం సీట్లు



మాట్లాడుతున్న వెలమ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందరావు

విజయనగరం ఫోర్ట్: జనాభా దామాషా ప్రకారం వెలమలకు రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని వెలమ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. బుధవారం స్థానిక ప్రదీప్‌నగర్‌లోని సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఐదు పార్లమెంట్, 25 అసెంబ్లీ స్థానాలకు వెలమలకు కేటాయించాలన్నారు. విజయనగరం, విశాఖపట్నం జిల్లాలో వెలమలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని తెలిపారు. వెలమ సామాజికవర్గాన్ని బీసీ–డీ నుంచి బీసీ -ఏలోకి మార్చాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు గంగు మన్మధరావు, రమ్య, పెదిరెడ్ల సత్యం, వరుదు రాజ్‌కుమార్, శశికుమార్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

భోగాపురం: భారత దేశ రక్షణ మంత్రిత్వ శాఖ ఆర్‌అండ్‌డీ ఆర్గనైజేషన్ అధికారులు పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో ఈ నెల 12 నుంచి 15 వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో ప్రయోగాత్మక విమాన ట్రయల్ రన్ చేస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సమయాల్లో రెండు మండలాలకు చెందిన మత్స్యకారులు చేపల వేటకు వెళ్లి ప్రమాదకర డేంజర్ జోన్‌లోకి ప్రవేశించవద్దని పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



సినిమా థియేటర్ సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

విజయనగరం టౌన్: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు అన్నారు. ఏపీ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని 'రంజని–శివరంజని' సినిమా థియేటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించి, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

దూడలను సంరక్షించుకోవాలి..

- జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి దామోదరరావు

నెల్లిమర్ల రూరల్: మేలుజాతి లేగదూడలను సంరక్షించుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి దామోదరరావు సూచించారు. మండలంలోని మల్యాడలో లేగదూడల అందాల పోటీల ప్రదర్శనను బుధవారం నిర్వహించారు. సుమారు 36 మంది రైతులు 38 లేగ దూడలను పోటీల్లో ప్రదర్శించారు. లేగ దూడల వయసును బట్టి మూడు విభాగాలుగా విభజించి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన లేగ దూడలకు చెందిన రైతులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి ఎస్. దామోదరరావు మాట్లాడుతూ మేలు జాతి ఆడ దూడలు పుట్టేందుకు లింగ నిర్ధారిత వీర్యాన్ని రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా ఖనిజ లవణ మిశ్రమం, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పప్పల బలరాం, సహాయ సంచాలకులు చక్రవర్తి, పశు వైద్యుడు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

కుళాయి పనులకు శంకుస్థాపన



ఇంటింటి కుళాయి పనులకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: వాటర్ ఎయిడ్ సంస్థ సహకారంతో మండలంలోని రెడ్డికంచేరులో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీరు అందించేందకు వాటర్ ఎయిడ్ సంస్థ ముందుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా వాటర్ ఎయిడ్ సంస్థ కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, సంస్థ ప్రతినిధులు మహ్మద్, కొండమ్మ, సర్పంచ్ బైరెడ్డి రమణ, డీబీ రెడ్డి, ఎర్రప్పలనారాయణ, అప్పన్న, శీరపు వంశీరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హేమంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ స్థానం తూర్పు కాపులకు కేటాయించాలి

- తూర్పు కాపు సామాజిక వేదిక డిమాండ్



నినాదాలు చేస్తున్న తూర్పుకాపు సామాజిక వేదిక ప్రతినిధులు

విజయనగరం పూల్‌బాగ్: తూర్పు కాపులు అధికంగా ఉన్న విజయనగరం జిల్లాలో ఎంపీ స్థానాన్ని తూర్పు కాపులకు కేటాయించాలని తూర్పుకాపుల సామాజిక వేదిక అధ్యక్షుడు రొంగలి రామారావు, ఉపాధ్యక్షులు అంబల్ల అప్పలనాయుడు, మజ్జి అప్పారావు డిమాండ్ చేశారు. తూర్పుకాపు సామాజిక వేదిక భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి తూర్పుకాపులు అన్నివిధాలుగా అన్యాయానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వెనుకబడిన జాతికి చెందిన తూర్పుకాపులను ఎల్లప్పుడూ బడుగు జాతులుగానే చూస్తున్నారే తప్ప పాలనాధికారాన్ని ఇచ్చేందుకు రాజకీయ పార్టీలు ముందుకు రావడంలేదన్నారు. జిల్లాలో తూర్పు కాపులు అధికంగా ఉన్నప్పటికీ విజయనగరం ఎంపీ స్థానాన్ని వేరే వారికి కేటాయించడం అన్యాయమని వాపోయారు. ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలు తమను గుర్తించాలని కోరారు. సమావేశంలో తూర్పు కాపు సామాజిక వేదిక వైస్ ప్రెసిడెంట్ పిన్నింటి చంద్రమౌళి, కోశాధికారి తట్టికాల వెంకటరమణ, న్యాయ సలహాదారులు చందక చిన్ని ప్రభాకర్ (చిన్ని), మంత్రి రమణమూర్తి, సంగంరెడ్డి సాయి, గంటిరెడ్డి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



సుప్రియకు ఆర్థిక సాయం అందజేస్తున్న జిల్లా ఆర్యవైశ్య మిత్రుల గ్రూప్ సభ్యులు

విజయనగరం: నగరానికి చెందిన కట్టా సుప్రియ ఇటీవల జరిగిన సీఏ ఫౌండేషన్ పరీక్షల్లో ఉత్తీర్ణురాలైంది. అయితే సీఏ చదివేందుకు ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో పచ్చిగుళ్ల రామారావు సహకారంతో విజయనగరం 'జిల్లా ఆర్యవైశ్య మిత్రుల గ్రూప్' ను సంప్రదించారు. గ్రూప్ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ వెంటనే స్పందించి గ్రూప్ సభ్యుల సహకారంతో రూ.53 వేలను సుప్రియకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు విద్య, వైద్యం, వివాహాలకు సంబంధించి ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. కార్యదర్శి డిమ్స్ రాజు మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాలుగా అనేక ప్రజాహిత సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పచ్చిగుళ్ల రామారావు, తీగెల సతీష్, బీపీఎస్ రామయ్య, ఏడుకొండలు, రాంజీ, కాపుగంటి రవి, కోటేశ్వరరావు, కట్టమూరి శంకరరావు, పెంటపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.